సాక్షి నల్లగొండ

బుధవారం, 28, ఆగస్టు, 2024



రాహుల్ ఓర్వలేకపోతున్నాడు

ప్రధానమంత్రి నరేంద్రమోదీని చూసి రాహుల్ గాంధీ ఓర్వలేకపోతున్నారని రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ అన్నారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 590.00 అడుగులు
ఇన్‌ఫ్లో	: 79,017 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 79,017 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,151 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 9,160 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,280 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం: 643.30 అడుగులు

ఇన్‌ఫ్లో	: 851.26 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 552.33 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 263.34 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 215.46 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 24.46 క్యూసెక్కులు

మత్తు వదిలిస్తున్నరు!

గంజాయి రవాణా, వాడకంపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం

- ప్రత్యేక కిట్‌తో నిరంతరం తనిఖీలు
- మొదటిసారి పట్టుబడితే కౌన్సిలింగ్, రెండోసారి దొరికితే జైలుకే..
- నెల వ్యవధిలో 180 మందికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్
- మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు
- గంజాయి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యంగా కార్యాచరణ



గంజాయి రహిత జిల్లానే లక్ష్యంగా పోలీస్‌శాఖ కార్యాచరణ అమలు చేస్తోంది. మాదకద్రవ్యాల రవాణా, వాడకంపై ప్రత్యేక నిఘా పెట్టింది. గంజాయి సేవించడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. కలెక్టర్, ఎస్పీ భాగస్వామ్యంతో 'నేను గంజాయి సేవించను' అనే నినాదంతో సోషల్ మీడియా ద్వారా ప్రచారం కల్పిస్తోంది. దీని ద్వారా తల్లిదండ్రులే తమ పిల్లల భవిష్యత్‌ను కాపాడాలని పోలీసులను కోరుతుండడం విశేషం.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : గంజాయి రవాణా, వాడకంపై పోలీస్‌శాఖ ఉక్కుపాదం మోపుతోంది. మిషన్ పరివర్తన్ పేరుతో యువతలో మార్పు కోసం కృషి చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తోంది. గడిచిన నెల రోజుల్లో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 43 కేసుల్లో రూ.కోటిన్నర విలువ చేసే 565 కిలోల గంజాయిని పట్టుకొని దహనం చేసింది. గంజాయి వినియోగించే యువతపైనా ప్రత్యేక దృష్టి సారించింది. మూడు వారాల్లోనే ప్రత్యేక కిట్ సహాయంతో గంజాయి వినియోగించే 180 మందిని గుర్తించి వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చింది. వారికి రెండోసారి, మూడోసారి టెస్టులు నిర్వహిస్తోంది. మొదటిసారి దొరికితే కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తున్న పోలీస్‌శాఖ ఆ తర్వాత పట్టుపడితే జైలుకు పంపిస్తామని స్పష్టం చేస్తోంది.

'నేను గంజాయి వాడను'

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు వినియోగ రహిత జిల్లాగా మార్చేందుకు మిషన్ పరివర్తన్ పేరుతో జిల్లాలో పోలీస్‌శాఖ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తోంది. జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రత్యేకంగా గంజాయి, డ్రగ్స్ బానిస అయిన వారిలో మార్పు తీసుకు వచ్చేందుకు గంజాయి సేవించే వారి, రవాణా చేస్తున్న వారి సమాచారం ఇవ్వాలని పేర్కొంటూ పోలీస్ శాఖ ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నంబర్ (8712670266) అందుబాటులోకి తెచ్చింది. కలెక్టర్, ఎస్పీ ఫొటోలు, ఫోన్ నంబర్‌తో పోస్టర్‌ను విడుదల చేసింది. ఈనెల 14వ తేదీ నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. నేను గంజాయి వాడను నినాదంతో కూడిన ఫొటోను విడుదల చేసింది. ప్రజలంతా ఆ ఫొటోను వాట్సప్ డీపీగా పెట్టుకోవాలని, అవగాహన కల్పించాలని పేర్కొంది. మాదక ద్రవ్యాలు, గంజాయిని వాడొద్దని, గంజాయి వాడకం, రవాణా చేసే వారి వివరాలను ఇవ్వాలని కలెక్టర్ నారాయణరెడ్డి వాయిస్ మెసేజ్‌ను విడుదల చేశారు.





గంజాయిపై సమాచారం ఇవ్వాలంటూ టోల్‌ఫ్రీ నంబరు, కలెక్టర్, ఎస్పీ ఫొటోలతో విడుదల చేసిన లోగోలు

మత్తు మందులపైనా ప్రత్యేక నిఘా..

మెడికల్ షాపుల్లో విక్రయించే మత్తు మందుల విక్రయంపైనా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా పెట్టింది. కొంతమంది పిల్లలు గంజాయి దొరక్క మత్తు మందులను వినియోగిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో మెడికల్ షాపుల యజమానులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి డాక్టర్ ప్రిస్కిప్షన్ లేకుండా మత్తు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని వారిని యజమానులను హెచ్చరించింది.

తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్

గంజాయి, డ్రగ్స్ తీసుకునే వారిని గుర్తించే ప్రత్యేకమైన కిట్‌ల సహాయంతో పోలీసు శాఖ పరీక్షలు నిర్వహిహిస్తోంది. ఇప్పటివరకు గంజాయి అలవాటు ఉన్న 180 మందికి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఈ స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీలు కొనసాగిస్తోంది. పోలీసు శాఖ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరుకు మెసేజ్‌లు పంపిస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. తల్లిదండ్రులు ఇచ్చిన సమాచారం మేరకు పిల్లలను తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇస్తోంది. గంజాయి సేవిస్తే ఆరోగ్యంపై పడే ప్రభావం, దానివల్ల కలిగే దుష్పరిణామాలు, నష్టాలపై సైకియాట్రిస్టులతోనూ కౌన్సిలింగ్ ఇప్పిస్తోంది.

మార్పు వస్తోంది

గంజాయి, ఇతర మందులను వినియోగించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. మండలాల వారీగా డ్రంకెన్ డ్రైవ్ తరహాలో ప్రత్యేక తనిఖీలు చేపట్టి గంజాయి సేవించే వారిని గుర్తిస్తున్నాం. తల్లిదండ్రులే తమ పిల్లలను మార్చాలంటూ ముందుకు వచ్చి చెబుతున్నారు. వారి సమక్షంలోనే కౌన్సిలింగ్ ఇస్తున్నాం. ఇప్పటివరకు కౌన్సిలింగ్ ఇచ్చిన 180 మంది పిల్లలకు మళ్లీ రెండోసారి, మూడోసారి పరీక్షలు నిర్వహించగా.. నెగెటివ్ వచ్చింది. వారిలో మార్పు వచ్చినట్లుగా భావిస్తున్నాం.

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్

వైద్యుల పర్యవేక్షణ అవసరం

- నొప్పులతో బాధపడే వారు స్టెరాయిడ్స్ తీసుకోవాలి
- సీజనల్ వ్యాధులకు ప్రభుత్వ ఆస్పత్రిల్లో చికిత్స అందిస్తున్నాం

'సాక్షి' ఫోన్ ఇన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి



ఫోన్ ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : చికున్‌గున్యా, డెంగీ ప్రభావం వల్ల జ్వరం, కీళ్ల, కాళ్ల నొప్పులతో బాధపడుతున్నవారు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలి. అలాంటి వారు 4, 5 రోజులు తక్కువ డోసు ఉన్న స్టెరాయిడ్స్ తీసుకుంటే నొప్పుల నుంచి ఉపశమనం పొందవచ్చని సూచిస్తున్నారు.. ప్రభుత్వ మెడికల్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ (జనరల్ మెడిసిన్) డాక్టర్ సురేష్‌కుమార్‌రెడ్డి. జిల్లాలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండడంతో మంగళవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో భాగంగా బాధితులు ఫోన్ ద్వారా చెప్పుకున్న ఆరోగ్య సమస్యలకు ఆయన సావధానంగా సమాధానం చెప్పారు.

ప్రశ్న : వారం క్రితం జ్వరం వచ్చి ఇబ్బందులు పడ్డాను. ఇప్పుడు జ్వరం తగ్గినప్పటికీ నీరసంగా ఉంది?

- జాఫర్, తాళ్లగడ్డ, మిర్యాలగూడ

డాక్టర్ : సీజనల్ వ్యాధుల వల్ల వచ్చే జ్వరం తగ్గినప్పటికీ నీరసంగా ఉంటుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలి. దాన్ని బట్టి డాక్టర్లు ఇచ్చే మందులను వాడితే తగ్గిపోతుంది.

ప్రశ్న : కీళ్ల నొప్పులు తగ్గడం లేదు?

- ఎన్.వెంకటయ్య, వి.శ్రీనివాసరెడ్డి, నల్లగొండ

డాక్టర్ : చికున్‌గున్యా తగ్గినప్పటికీ చాలా రోజుల వరకు కీళ్ల నొప్పులు ఉంటాయి. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వస్తే నొప్పులు తగ్గడానికి స్టెరాయిడ్స్ ఇస్తాం.

ప్రశ్న : జ్వరం, కీళ్లు, ఒంటినొప్పులతో బాధపడుతున్నాం? - వెంకన్న, ఎర్రబెల్లి, నిడమనూరు మండలం

డాక్టర్ : విష జ్వరాల వల్ల చాలా మంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దానికి తోడు చికున్‌గున్యా వల్ల జ్వరాలు తగ్గుతున్నప్పటికీ ఒంటి నొప్పులతో బాధపడుతున్నారు. నొప్పులు చాలా రోజుల వరకు ఉంటాయి. అలాంటి వారు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వస్తే సరైన మందులు అందిస్తాం. నొప్పులు తగ్గడానికి అవసరమైన స్టెరాయిడ్స్ కూడా అందిస్తాం. వైద్యుల పర్యవేక్షణలోనే స్టెరాయిడ్స్ తీసుకోవాలి.

ప్రశ్న : వారం నుంచి జ్వరం ఉంది. టాబ్లెట్లు వేసుకున్నా తగ్గడం లేదు?

- ఈశ్వర్, శ్రీరాంనగర్‌కాలనీ, నల్లగొండ

డాక్టర్ : జ్వరం తగ్గకపోవడానికి కారణం వైరల్ ఫీవర్ అయి ఉంటుంది. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుంటే ఆ రిపోర్టుల ఆధారంగా డాక్టర్లు ఇచ్చిన మందులను వాడితే సరిపోతుంది.

ప్రశ్న : దోమల నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు?

-టి. ఉదయభాను, నాగార్జునసాగర్

డాక్టర్ : మున్సిపల్ అధికారులకు సమాచారం ఇస్తే దోమల నివారణ కోసం మందులు చల్లిస్తారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాల్లో మురుగు గుంతలు లేకుండా చూసుకుని పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

ప్రశ్న: జ్వరం వచ్చి తగ్గింది. కానీ లేచి నడవలేక పోతున్నాను?

- లక్ష్మీతులసి, మిర్యాలగూడ

డాక్టర్ : సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోండి. ఆ రిపోర్టుల ఆధారంగా మందులు ఇస్తారు. అవసరమైతే ఆసుపత్రిలో జాయిన్ చేసుకుని పూర్తిగా నయమయ్యే వరకు చికిత్స అందిస్తారు.

న్యూస్‌రీల్

హైడ్రాను అంతటా అమలు చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం లేఖ

నకిరేకల్ : హైదరాబాద్‌లో చెరువులు, కుంటలను అక్రమణకు చెరనుంచి కాపాడేందుకు అమలు చేస్తున్న హైడ్రాను రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖ కాపీని నకిరేకల్‌లో మంగళవారం విడుదల చేశారు. నల్లగొండ జిల్లాతో పాటు నకిరేకల్ నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో అన్ని చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ణయించి పరిరక్షించాలని కోరారు. నకిరేకల్ నియోజకవర్గంలో 70 కిలోమీటర్ల మేర జాతీయరహదారి ఉందని.. భూముల రేట్లు పెరడగడంతో చెరువులు, కుంటలను ఆక్రమించి వెంచర్లు చేశారని లేఖలో వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రా ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని.. జిల్లాల్లో కూడా అమలు చేస్తే చెరువులు, కుంటలను రక్షించవచ్చని పేర్కొన్నారు.

విధుల్లో చేరిన మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

నల్లగొండ టౌన్ : నల్లగొండ ప్రభుత్వ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ ఎస్.శ్రీవాణి మంగళవారం విధుల్లో చేరారు. ప్రస్తుతం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రాధాకృష్ణ నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న డాక్టర్ రాజకుమారి బదిలీల్లో భాగంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా బదిలీ కావడంతో ఆమెస్థానంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ శ్రీవాణిని నియమించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కట్టంగూర్ పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

కట్టంగూర్ : వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళా కేంద్రం పని తీరును ఆయన పరిశీలించి రోగుల సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ రిజిస్టర్‌ను, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లోకసాని వేణుగోపాల్‌రెడ్డి, వైద్యాధికారి శ్వేత, సీహెచ్‌ఓ నర్సింహారావు, శ్యామ్‌సుందర్, అలివేలు మంగ, ఉపేంద్ర, నరేందర్‌రెడ్డి, రాజమ్మ, ఫార్మసిస్ట్ శేఖర్, ఎల్‌టీ సైదమ్మ ఉన్నారు.

టెండర్ల ఆహ్వానం

నల్లగొండ రూరల్ : ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలాల్లో పెట్రోలు బంక్‌లు నిర్వహించేందుకు ఆన్‌లైన్ విధానంలో టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దామరచర్ల, నకిరేకల్, మర్రిగూడ బస్టాండ్‌లలోని ఖాళీ స్థలంలో పెట్రోలు బంక్‌లు నిర్వహించేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని వివరాలకు 7382834223 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

29న క్రీడా దినోత్సవం

నల్లగొండ టూటౌన్ : భారతీయ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న నల్లగొండలోని ఇండోర్ స్టేడియంలో క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తామని.. మహిళల విభాగంగా షాట్‌పుట్, చెస్, బ్యాడ్మింటన్, టగాఫ్ వార్, 50 ఏళ్ల వయస్సు పైబడిన వారికి వాక్ రన్ 50 మీటర్లు, 50 ఏళ్లలోపు వారికి 100 మీటర్ల రన్ పోటీలు నిర్వహిస్తామని.. పురుషుల విభాగంలో వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, టగాఫ్ వార్, 50 సంవత్సరాలు పైడిన వారికి 50 మీటర్ల వాక్‌రన్, 50 ఏళ్లలోపు వారికి 100 మీటర్ల రన్ నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి గల ప్రభుత్వ ఉద్యోగులు 29న ఉదయం 8 గంటలకు ఇండోర్ స్టేడియంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

రుణమాఫీకి కొర్రీలు వద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా ఎలాంటి కొర్రీలు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొంతమంది రైతులకే మాఫీ చేయడం సరికాదన్నారు. సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. ఎలాంటి కొర్రీలు లేకుండా రుణమాఫీ చేయాలని.. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు ఉజ్జిని యాదగిరిరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాన్నారు. రుణమాఫీకి ఆంక్షలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎండీ.మెయినుద్దీన్, గురిజ రామచంద్రం, బంటు వెంకటేశ్వర్లు, పబ్బు వీరస్వామి, లొడంగి శ్రవణ్‌కుమార్, పల్లా దేవేందర్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, బూర శేఖర్, బండ మీద యాదయ్య, వెంకన్న, పాండు, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో రూ.1433 కోట్ల రుణమాఫీ

శాలిగౌరారం : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పంట రుణమాఫీ పథకం కింద జిల్లాలో మూడు విడతల్లో 1.73 లక్షల మంది రైతులకు రూ.1433 కోట్లు మాఫీ అయ్యాయని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) శ్రవణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం శాలిగౌరారం మండలంలోని అడ్లూరు గ్రామంలో పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామంలో రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వేను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ జరిగిన రైతుల్లో ఇప్పటి వరకు సగం మంది రూ.740 కోట్లు పంట రుణాలను తిరిగి పొందారన్నారు. కుటుంబం యూనిట్‌గా రుణమాఫీ జరుగుతుందని, అర్హత ఉండి ఏదేని కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులకు ఈ సర్వే అనంతరం రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు 5.30 లక్షల ఎకరాల్లో పత్తి, 3.12 లక్షల ఎకరాల్లో వరి సాగైందని తెలిపారు. జిల్లాలో పంటల సాగుకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆయనవెంట ఏఓ సౌమ్యశృతి, ఏఈఓలు శ్రవణ్‌రెడ్డి, కీర్తి ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

రోడ్డు ప్రమాదాలను నివారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ క్రైం : రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ పోలీసులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఏఎస్పీ రాములునాయక్‌తో కలిసి ఎస్పీ మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరతగతిన పరిష్కరించాలన్నారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు గ్రామస్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గంజాయి నిర్మూలనపై అవగాహన కల్పించడం ద్వారా యువత చెడు మార్గంలో పయనించకుండా చూడాలన్నారు. మైనర్లపై జరిగిన లైంగికదాడులు, దొంగతనం కేసుల్లో విచారణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కేసుల విచారణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని భారత ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. డయల్ 100కు వచ్చిన ఫోన్లకు వెంటనే స్పందించాలన్నారు. ప్రజల భద్రత కోసం 24 గంటలు పోలీసులు మఫ్టీలో కూడా గస్తీ నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చూడాలని, గంజాయి, పేకాట, ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణపై దృష్టి సారించాలన్నారు. అన్ని శాఖల సమన్వయంతో ప్రమాద రహిత జిల్లాగా మార్చాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. రాత్రి సమయాల్లో అతి వేగంగా, అజాగ్రత్తగా నడిపే వాహనాలు గుర్తించి సీజ్ చేసి, జరిమానా విధిస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు శివరాంరెడ్డి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి సన్నిధిలో గవర్నర్



యాదాద్రి ప్రధానాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- ప్రధానాలయంలో ప్రత్యేక పూజలు చేసిన జిష్ణుదేవ్ వర్మ
- ఘన స్వాగతం పలికిన ఆలయ అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్: రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు కొండపైన ఉన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు అధికారులు, వేద పండితులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రధానాలయంలో ధ్వజ స్తంభం వద్ద మొక్కి, స్వామివారి అంతరాలయంలో పూజలు చేశారు. రాష్ట్ర దేవాయదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు గవర్నర్‌ను శాలువాతో సత్కరించారు.

పటిష్ట పోలీస్ బందోబస్త్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో పోలీస్ శాఖ పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేసింది. డీసీపీ రాజేష్ చంద్రతో పాటుగా ఇద్దరు అడిషనల్ డీసీపీలు, నలుగురు ఏసీపీలు, పోలీసులు 120 మంది, ఏఆర్‌లు 30, ఎస్‌పీఎఫ్‌లు 30, ఫారెస్ట్ సిబ్బంది 20, రెండు డాగ్ స్క్వాడ్‌ల బృందం, ముగ్గురు సీఐలు, పదిమంది ఎస్‌ఐలు బందోబస్త్‌లో పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన సాగిందిలా..

- ఉదయం 8:06 గంటలకు యాదాద్రి కొండపైకి రోడ్డు మార్గం ద్వారా చేరుకున్నారు.
- 8:08 గంటలకు కొండపైన పోలీసులు గౌరవ వందనం స్వీకరించారు.
- 8:20 గంటలకు కొండపైన ఉన్న విష్ణు పుష్కరిణిలో స్నాన సంకల్ప పూజలు ఆచరించారు.
- 8:30కి అఖండ జ్యోతి దీపారాధన చేశారు.
- 8:35 గంటలకు ఆలయంలోనికి ప్రవేశించారు.
- 9:11కు స్వయంభూవులకు పూజలు చేసి, వేదాశీర్వచనాలు స్వీకరించి పశ్చిమ రాజగోపురం నుంచి బయటకు వచ్చారు.
- 9:58 గంటలకు యాదాద్రి ఆలయం నుంచి జనగాం జిల్లాకు రోడ్డు మార్గం ద్వారా తిరుగు ప్రయాణం అయ్యారు.

పల్లెలకు నిధులు

- గ్రామ పంచాయతీలకు అన్‌టైడ్ గ్రాంట్ రూ.10.90 కోట్లు విడుదల
- ఒక్కో ఊరికి రూ.9 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు..
- పాలకవర్గాలు లేకున్నా 15వ ఆర్థిక సంఘం నిధులు రావడంపై హర్షం



నల్లగొండ : గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. జిల్లాకు అన్‌టైడ్ గ్రాంట్ కింద కేంద్రం 10 కోట్ల 90 లక్షల 44 వేల 480 రూపాయలు విడుదల చేసింది. జనాభా ఆధారంగా ఆయా పంచాయతీలకు ఈ నిధులు కేటాయించనున్నారు. ఈ నిధులు ఒక్కో పంచాయతీకి రూ.9 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు వచ్చే అవకాశం ఉంటుంది. పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి ముగిసి ఆరు మాసాలు గడిచింది. పాలకవర్గాలు లేకపోవడంతో ఇప్పటి వరకు ఆర్థిక సంఘం నిధులు రాక పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో పంచాయతీ కార్యదర్శులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అప్పులు చేస్తున్న కార్యదర్శులు..

అయితే వాస్తవంగా పాలక వర్గాలుంటేనే ఆర్థిక సంఘం నిధులు రావాలి. కానీ ఆరు మాసాలుగా నిధులు లేక పంచాయతీలు ఆర్థికంగా కునారిల్లుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు పంచాయతీల్లో లైట్లు పోయినా, డ్రెయినేజీ శుభ్రం చేయాలన్నా, మోటార్ల మరమ్మతు ఇలా ఏ పని చేయాలన్నా కార్యదర్శులే అప్పులు చేసి పనులు చేయిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల్లో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు తప్ప మిగతా ఎలాంటి పనులకు నిధులు ఇవ్వడం లేదు. ఈ పరిస్థితిలో ఇప్పుడు వచ్చిన అన్‌టైడ్ నిధులు కార్యదర్శులకు కాస్త ఉపశమనం కలిగించనున్నాయి.

ఒక్కో వ్యక్తికి రూ.89 చొప్పున

పంచాయతీ పాలకవర్గాలు లేకపోయినా ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేసింది. జనాభాను బట్టి ఒక్కో వ్యక్తికి రూ.89 చొప్పన నిధులు ఇచ్చింది. ఇదే సందర్భంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. దీన్ని బట్టి ఈసారి పాలకవర్గాలు కొలువు దీరిన తర్వాతే ఆర్థిక సంఘం నిధులు వచ్చే అవకాశం ఉంది.

అన్‌టైడ్ నిధులు అంటే..

ఆర్థిక సంఘం టైడ్, అన్‌టైడ్ గ్రాంట్‌లను విడుదల చేస్తుంది. టైడ్ నిధులు అంటే తాగునీరు, డ్రెయినేజీ పనులకు మాత్రమే ఖర్చు చేయాలి. కానీ అన్‌టైడ్ కింద వచ్చే నిధులను తాగునీరు, డ్రెయినేజీలతోపాటు ఇతర పనులకు కూడా వాడుకోవచ్చు.

క్లుప్తంగా

సెప్టెంబర్ 6 నుంచి ఎంజీయూ పీజీ పరీక్షలు

ఎంజీయూనివర్సిటీ (నల్లగొండరూరల్): మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో సెప్టెంబర్ 6వ తేదీ నుంచి ఎంఏ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంబీఏ, ఎంసీఏ, టీటీఎం రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంజీయూ పరీక్షల నియంత్రణ అధికారి ఉపేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల సమయాన్ని యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పెట్టామని, అన్ని కళాశాలలకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత


పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన మద్యం

రామన్నపేట: మండలంలోని వెల్లంకి గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లంకి గ్రామంలోని ఓ కిరాణా షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ సురేందర్ పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించగా షాపు వెనుక చెట్ల పొదల్లో 25లీటర్ల మద్యం లభించింది. పట్టుబడిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కిరాణా షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మొక్కల అడుగు భాగంలో పాదులు తీయించాలి


చలకుర్తి సంపద వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దవూర: హరితహారంలో నాటిన మొక్కల అడుగు భాగంలో పాదులు తీయించి వర్షపు నీరు నిలిచేలా చూడాలని ఎఫ్‌డీఓ రామమోహన్, ఏపీడీ నీరుడు బాలకృష్ణ అన్నారు. మంగళవారం పెద్దవూర మండలం చలకుర్తి గ్రామ సమీపంలో సాగర్ ఎడమ కాల్వ వెంట ఏర్పాటు చేసిన సంపద వనాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు సంపద వనం మొత్తం తిరిగి ప్రతి మొక్కను పరిశీలించారు. గతేడాది సంపద వనంలో 11,250 మొక్కలు నాటినట్లు పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించటం హర్షణీయమన్నారు. సంపద వనంలోకి పశువులు, గొర్రెలు, మేకలను రానివ్వకుండా చూసుకోవాలన్నారు. నాటిన మొక్క ఎండిపోతే వెంటనే ఆ ప్రదేశంలో మరో మొక్కను నాటాలని సూచించారు. వారి వెంట ఎఫ్‌ఎస్‌ఓలు మధుసూదన్‌గౌడ్, పద్మాబాయి, నవీన్, స్థానిక ఎంపీడీఓ ఉమాదేవి, ఏపీఓ యాట వెంకటేశ్వర్లు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రవీందర్ రెడ్డి, టీఏలు అంజి, మహేష్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు వేదికగా..

- భువనగిరిలో కొనసాగుతున్న టెన్నిస్ టోర్నమెంట్
- పాల్గొంటున్న వివిధ దేశాల క్రీడాకారులు



టెన్నిస్ టోర్నమెంట్‌లో తలపడుతున్న క్రీడాకారులు

భువనగిరి: అంతర్జాతీయ టెన్నిస్ పోటీలకు భువనగిరి వేదికైంది. పట్టణంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో రాజా నర్సింహారావు మెమోరియల్, ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–18 విభాగంలో జూనియర్ టెన్నిస్ టోర్నమెంట్ జరుగుతోంది. ఈ అకాడమీలో రూ.5కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో న్యూ డైమెన్షన్ ఇంటర్నేషన్ స్కూల్‌కు చెందిన యాజమాన్యం 8 సింథటిక్ కోర్టులు నిర్మించారు. ఇందులో నాలుగు కోర్టుల్లో ఫ్లడ్ లైట్లు కూడా ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రధాన నగరాల్లో ఉన్న కోర్టులతో పోల్చితే ఇక్కడ అత్యాధునిక కోర్టులు ఉన్నట్లు క్రీడాకారులు చెబుతున్నారు.

ఆసక్తి కనబర్చుతున్న క్రీడాకారులు

ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాల్లో ఎక్కువగా టెన్నిస్ కోర్టులు ఉండడంతో జాతీయ, అంతర్జాతీయ టెన్నిస్ పోటీలు ఆ నగరాలకే పరిమితం కావడం సహజం. కానీ భువనగిరి పట్టణంలోని న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన టెన్నిస్ కోర్టుల్లో పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపుతున్నారు. ఇక్కడ ఈ ఏడాది ఏప్రిల్ 29 నుంచి మే 4వ తేదీ వరకు జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు జరగగా.. నాలుగు నెలల వ్యవధిలోనే అంతర్జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం విశేషం. ప్రస్తుతం జరుగుతున్న పోటీలు ముగియగానే మరో వారం రోజుల్లో అంతర్జాతీయ పురుషుల, మహిళ టెన్నిస్ పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సెప్టెంబర్ 1న ముగియనున్న పోటీలు..

న్యూ డైమెన్షన్ టెన్నిస్ అకాడమీలో అండర్–18 విభాగంలో జరుగుతున్న టెన్నిస్ పోటీలు ఈ నెల 25న ప్రారంభం కాగా సెప్టెంబర్ 1వ తేదీన ముగియనున్నాయి. అంతర్జాతీయ ర్యాకింగ్స్ కోసం జరుగుతున్న ఈ పోటీల్లో భారత్‌తో పాటు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాలకు చెందిన సుమారు 160 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ఈ టోర్నమెంట్‌లో 100 మ్యాచ్‌లు జరగనున్నాయి. క్వాలిఫైయింగ్, నాకౌట్, ప్రీ క్వార్టర్స్, క్వార్టర్స్, సెమీఫైనల్, ఫైనల్ నిర్వహించనున్నారు.

ఒలింపిక్స్‌లో ఆడేందుకు..



భువనగిరిలో అంతర్జాతీయ స్థాయి పోటీలకు అనుగుణంగా టెన్నిస్ కోర్టులు ఉన్నాయి. చాలా దేశాలలో ఆడాను కానీ ఇక్కడ ఉన్న కోర్టులు మంచి ప్రమాణాలతో నిర్మించారు. గ్రామీణ వాతావరణంలో ఆడుతుంటే సంతోషంగా ఉంది. ఒలింపిక్స్‌లో పోటీ పడేందుకు కావల్సిన ర్యాకింగ్ సాధించేందుకు ప్రయత్నం చేస్తున్నాను.

– అతిథి పాటిల్, టెన్నిస్ క్రీడాకారిణి, అమెరికా

నైపుణ్యం కలిగిన కోచ్‌లు ఉన్నారు



భువనగిరిలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ టెన్నిస్ టోర్నమెంట్ బాగుంది. సౌకర్యాలు కూడా బాగున్నాయి. పోటీల నిర్వహణతో పాటు నైపుణ్యం కలిగిన కోచ్‌లు ఉన్నారు. ప్రస్తుతం నా ర్యాకింగ్ 1900గా ఉంది. 500 రాక్యింగ్ కోసం ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఈ టోర్నమెంట్‌లో సాధిస్తాననే నమ్మకం ఉంది.

– ప్రైషా, టెన్నిస్ క్రీడాకారిణి, కర్నాటక

విదేశాల్లో కంటే మెరుగ్గా కోర్టులు



నేను శ్రీలంక, బంగ్లాదేశ్‌లో అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్లలో ఆడాను. అక్కడ ఉన్న కోర్టుల కంటే ఇక్కడ అధునాతన ప్రమాణాలతో కోర్టులు ఉన్నాయి. క్రీడాకారులకు ఇలాంటి కోర్టులు ఉండాలి. 100లోపు ర్యాకింగ్ ఉండటం కోసం కృషి చేస్తున్నాను. 10 సంవత్సరాల వయస్సు నుంచే టెన్నిస్ ఆడటం ప్రారంభించాను.

– నౌశిక్‌రెడ్డి, టెన్నిస్ క్రీడాకారుడు, తెలంగాణ

నిర్వహణ బాగుంది



దేశంలో ముఖ్యమైన నగరాలలో టెన్నిస్ కోర్టులు ఉంటాయి. కానీ గ్రామీణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న భువనగిరి పట్టణంలో ఇలాంటి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కోర్టులు ఏర్పాటు చేయడంతో గ్రామీణ క్రీడాకారులు ప్రోత్సహించనట్లు ఉంటుంది. ఇక్కడ క్రీడా పోటీల నిర్వహణ కూడా బాగుంది.

– వినిత్, టెన్నిస్ క్రీడాకారుడు, తెలంగాణ

గ్రంథాలయాలతో జ్ఞాన సముపార్జన

- ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి


కాళోజీ పుస్తకాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న ప్రెస్ అకాడమీ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం: జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడుతాయని తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జేడీ ఫౌండేషన్ సహకారంతో సంస్థాన్ నారాయణపురం మండలం జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన కాళోజీ పుస్తకాలయం(గ్రంథాలయం)ను మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తకాలను, మహానుభావుల ఫొటోలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చదువుకున్న వారిలో ఆలోచనా శక్తి అధికంగా ఉంటుందన్నారు. విద్యార్థులు, యువత ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకెళ్తే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని అన్నారు. డాక్టర్లు, ఇంజనీర్లు అవ్వడం మాత్రమే కాకుండా ఇంకా ఎన్నో రంగాల్లో విద్యార్థులకు అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఎందులోనైనా రాణించవచ్చన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడానికి త్వరలో రాష్ట్రంలోని సీనియర్ జర్నలిస్టులతో కమిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. వచ్చే నెల చివరి వరకు అక్రిడిటేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, ఇళ్ల స్థలాల వంటి వాటిపైన స్పష్టత ఇవ్వబోతున్నట్లు వివరించారు. అనంతరం రాచకొండలో పలు చారిత్రక ప్రదేశాలను శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అంతకుముందు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ వీడియో కాల్ ద్వారా తన సందేశాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పింగళి కవితారెడ్డి, ఫౌండేషన్ సభ్యుడు నాగమోహన్, డిప్యూటీ తహసీల్దార్ మమత, ఎస్‌ఐ జగన్, పాఠశాలల హెచ్‌ఎంలు విజయ, కర్ణ, నాగభూషణం, కిషన్, ఎండీ రెహ్మాన్, ఎర్ర మల్లేష్, బెలిదే చంద్రశేఖర్, మంచాల జంగయ్య, కొండూరి స్వామి, గణేష్, మంచాల సైదులు తదితరులున్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

నల్లగొండ క్రైం: రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముశంపల్లి రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తుండగా పెద్దవూర మండలం గెమ్యానాయక్ తండాకు చెందిన బానావతు చందూలాల్ అయిదున్నర క్వింటాళ్ల రేషన్ బియ్యం ఆటోలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నల్లగొండ పట్టణంలోని రాక్‌హిల్స్ కాలనీలో నివాసముంటున్న చందులాల్ సమీప గ్రామాల్లో తక్కువ ధరకు రేషన్ బియ్యం కొనుగోలు చేసి అదే కాలనీలోకి చెందిన రమావత్ హరిలాల్‌కు ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

నల్లగొండ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా పడినట్లు నల్లగొండ వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. వన్‌టౌన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 45మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించామన్నారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మద్దిరాల: తండ్రి బైక్ ఇవ్వనందుకు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం.. మద్దిరాల మండలం చౌళ్లతండాకు చెందిన భూక్యా నవీన్(24) గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 23వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి నవీన్.. తాను సూర్యాపేటకు వెళ్లాలని, బైక్ ఇవ్వమని తండ్రి మల్సూర్‌ను అడిగాడు. తండ్రి బైక్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురైన నవీన్ ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎన్నిరోజులు చికిత్స అందించినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకురాగా.. ఇక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీకొని..


సత్యం (ఫైల్)

హాలియా: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియా మున్సిపాలిటీ పరిధిలోని ఇబ్రహీంపేట గ్రామానికి చెందిన లింగాల సత్యం ఓ రైస్ మిల్లులో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీ రాత్రి పని ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఇబ్రహీంపేట గ్రామ స్టేజీ సమీపంలో 167వ నంబర్ జాతీయ రహదారిపై హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న పెద్దవూర మండల కేంద్రానికి చెందిన పి. కోటేష్ బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా లింగాల సత్యం పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ లింగాల సత్యం మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు లింగాల గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి

యాదగిరిగుట్ట రూరల్: రోడ్డు ప్రమాదంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ శివారులో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వంకుడోత్ కీమ్యానాయక్(55) విధి నిర్వహణలో భాగంగా మంగళవారం బైక్‌పై భువనగిరికి వెళ్లి తిరిగి ఆలేరు పట్టణానికి వస్తున్నాడు. మార్గమధ్యలో వంగపల్లి గ్రామ శివారులోని కార్తికేయ ఇండస్ట్రీస్ వద్దకు రాగానే హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వెనుక నుంచి అతివేగంగా కారు వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కీమ్యానాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు తిలక్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్ట్

- కిలో గంజాయి స్వాధీనం

సూర్యాపేట టౌన్: గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తున్న నలుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్ నిందితుల వివరాలు తెలిపారు. సూర్యాపేట పట్టణానికి చెందిన షేక్ ఆసిఫ్ బాబా అలియాస్ హజ్జు, ఇరుగు రోహిత్, పాలేటి గణేష్, పిల్లలమర్రికి చెందిన బట్టు హరీష్ అలియాస్ వీరప్పన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అరకు ప్రాంతానికి వెళ్లి కిలో గంజాయి కొనుగోలు చేసి సూర్యాపేటకు తీసుకొచ్చారు. ఆ గంజాయిని సూర్యాపేట పట్టణంలోని పాత వ్యవసాయ మార్కెట్ వద్ద వేరే వ్యక్తులకు అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కుక్కల దాడిలో గాయాలు

అడ్డగూడూరు: కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన అడ్డగూడూరు మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అడ్డగూడూరు మండలంలోని మానాయికుంట గ్రామానికి చెందిన ఎస్. బాబు మండల కేంద్రంలోని అడ్డగూడూరు–మోత్కూర్ ప్రధాన రోడ్డుపై వెళ్తుండగా కుక్కలు వెంబడించి అతడి కాలును కరిచాయి. దీంతో బాబు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గమనించి కుక్కలను వెళ్లగొట్టారు. స్థానికులు చికిత్స నిమిత్తం బాబును మోత్కూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోదాడ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక


ఎన్నికైన అసోసియేషన్ నూతన సభ్యులు

కోదాడరూరల్: కోదాడ లారీ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికను మంగళవారం పట్టణ పరిధిలోని మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా తూనం కృష్ణ, ఉపాధ్యక్షుడిగా పెద్ది చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా యలమందల నరసయ్య, సహాయ కార్యదర్శులుగా పప్పుల కోటయ్య, సామా వెంకట్‌రెడ్డి, కోశాధికారిగా షేక్.జానిబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో లారీ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ రామినేని శ్రీనివాసరావు, ఆవుల రామారావు, పైడిమర్రి వెంకటనారాయణ, అల్తాఫ్ హుస్సేన్, కనగాల నాగేశ్వరరావు, ఓరుగంటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మోదీని చూసి రాహుల్ ఓర్వలేకపోతున్నాడు

- రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్


మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

యాదగిరిగుట్ట రూరల్: నరేంద్ర మోదీ మూడవసారి ప్రధాన మంత్రిగా కావడంతో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతుందని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 40 సంవత్సరాల్లో బీజేపీకి తప్ప దేశంలో ఏ పార్టీకీ అత్యధిక మెజార్టీ రాలేదన్నారు. రాహుల్ గాంధీ ఓర్వలేక దేశం అస్థిత్వాన్ని కోల్పోయే విధంగా వ్యాఖ్యలు చేస్తూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్‌తో పొత్తు పెట్టుకోవడం దేనికి సంకేతమన్నారు. ఎస్సీ, ఎస్టీలు మొదటిసారిగా జమ్మూలో ఎమ్మెల్యేలు కాబోతున్నారని చెప్పారు. తెలంగాణలో 42 శాతం బీసీ రిజర్వేషన్‌లు ఇస్తామని చెప్పి ఇప్పుడేమైందని కాంగ్రెస్ పార్టీని విమర్శించారు. సుప్రీం కోర్టు వర్గీకరణ చేస్తే, దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని అన్నారు. దేశంలో గతంలో అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ ఎందుకు కులగణన చేయలేదని ప్రశ్నించారు. తెలంగాణలో సామాజిక న్యాయం బీజేపీ వల్లనే సాధ్యపడుతుందన్నారు. హైడ్రా కూల్చివేతలకు తాము వ్యతిరేకం కాదని, అక్రమ కట్టడాలను కూలిస్తే తాము స్వాగతిస్తామన్నారు. కవిత బెయిల్‌కు రావడంతో బీజేపీ బీఆర్‌ఎస్ ఒక్కటి అనడం కాంగ్రెస్ దిగజారుడు తనంగా భావిస్తామన్నారు. ఇదంతా విష ప్రచారమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, గూడూరు నారాయణ రెడ్డి, పడాల శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న కె. లక్ష్మణ్..

యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

జల్సాలకు అలవాటుపడి విద్యుత్ మోటార్ల చోరీ


స్వాధీనం చేసుకున్న మోటార్లను చూపుతున్న ఎస్పీ


స్వాధీనం చేసుకున్న డబ్బు

- నలుగురు దొంగలతో పాటు మోటార్లు కొనుగోలు చేసిన వ్యక్తి అరెస్ట్
- 31 విద్యుత్ మోటార్లు, రూ.10లక్షల నగదు, ఆటో, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

సూర్యాపేటటౌన్: జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం వ్యవసాయ మోటార్లు చోరీ చేస్తున్న నలుగురు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఏఎస్పీ నాగేశ్వర్‌రావుతో కలిసి ఎస్పీ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లాకు చెందిన ఉప్పతల వాసు, మఠంపల్లి మండలానికి చెందిన వేముల కోటేశ్వర్‌రావు, అకారపు వెంకటి, అజ్మీర మంత్రియ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం గరిడేపల్లి, హుజుర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు, పాలకవీడు, చిలుకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో వ్యవసాయ బావులు, చెరువులు, వాగులపై రైతులు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లను దొంగిలించేందుకు పగటి పూట రెక్కీ నిర్వహించేవారు. రాత్రి సమయంలో విద్యుత్ మోటార్లను చోరీ చేసి మట్టపల్లి గ్రామానికి చెందిన పాత ఇనుము వ్యాపారి గడగంట్ల శ్రీనుకు అమ్మి సొమ్ము చేసుకునే వారు. ఈ నెల 26న గరిడేపల్లి పోలీసులు గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు రోడ్డులో పరెడ్డిగూడెం గ్రామ స్టేజీ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అటుగా వెళ్తున్న ఉప్పల వాసు, వేముల కోటేశ్వర్‌రావు పోలీసులను గమనించి పారిపోయేందుకు యత్నించగా.. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వారితో పాటు మరో ఇద్దరు మొత్తం నలుగురు కలిసి విద్యుత్ మోటార్లు చోరీ చేస్తున్నట్లు నిజం ఒప్పుకున్నారు. వీరిపై గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌లో 13 కేసులు, హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఏడు కేసులు, మఠంపల్లి పోలీస్ స్టేషన్‌లో మూడు, పాలకవీడు, చిలుకూరు, మేళ్లచెరువు పోలీస్ స్టేషన్లలో ఒక్కోటి చొప్పున కేసులు నమోదైనట్లు ఎస్పీ పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.4.34లక్షల విలువైన 31 విద్యుత్ మోటార్లు, రూ.10.01లక్షల నగదు, ఆటో, మూడు బైక్‌లు, సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. వీరితో పాటు మోటార్లు కొనుగోలు చేసిన వ్యక్తిని కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, గరిడేపల్లి ఎస్‌ఐలు సైదులు, సీహెచ్. నరేష్, ఐడీ పార్టీ సిబ్బంది నాగరాజు, శంభయ్య, రామారావును ఎస్పీ అభినందించారు.

భార్య అస్థికలు నీటిలో కలపడానికి వచ్చి..

- సాగర్ ఎడమ కాల్వలో భర్త గల్లంతు


ముత్తయ్య

హాలియా: మృతిచెందిన తన భార్య అస్థికలు నీటిలో కలపడానికి వచ్చిన భర్త ప్రమాదవశాత్తు సాగర్ ఎడమ కాల్వలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన హాలియా పట్టణంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం కొత్తలూరు గ్రామానికి చెందిన తరి ముత్తయ్య(59) భార్య ఇద్దమ్మ ఇటీవల మృతిచెందింది. సోమవారం గ్రామంలో ఆమె దశ దినకర్మ నిర్వహించారు. కార్యక్రమం ముగిసిన తర్వాత భార్య అస్థికలు నీటిలో కలిపి నిద్ర చేసేందుకు ముత్తయ్య సోమవారం రాత్రి 11గంటలకు హాలియాకు వచ్చాడు. ఈ క్రమంలో హాలియా పట్టణంలోని సాగర్ ఎడమ కాల్వలో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి గల్లంతయ్యాడు. ముత్తయ్య ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టారు. ముత్తయ్య అల్లుడు రావులపాటి శంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరు దుర్మరణం



శ్రీధర్‌రెడ్డి (ఫైల్)

చౌటుప్పల్ రూరల్: బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం కేర్చిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వీర్లగడ్డకు చెందిన కళ్లెం శ్రీధర్‌రెడ్డి(45) గ్రామంలో వ్యవసాయంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ హైదరాబాద్‌లోని బీఎన్ రెడ్డి నగర్‌లో నివాసముంటున్నారు. ఇటీవల రైతు రుణమాఫీ కావడంతో మంగళవారం బైక్‌పై వేములకొండలోని బ్యాంక్‌కు వచ్చాడు. తిరిగి హైదరాబాద్‌కు వెళ్తుండగా చౌటుప్పల్ మండలం జైకేసారం గ్రామ సమీపంలోని కాటమయ్య గుడి వద్ద చౌటుప్పల్ నుంచి వలిగొండ వైపు వెళ్తున్న కారు డీసీఎంను ఓవర్‌టేక్ చేయబోతూ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీధర్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చౌటుప్పల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

చౌటుప్పల్ రూరల్: ఆగి ఉన్న ఆటోను కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన చౌటుప్పల్ మండలంలోని తుప్రాన్‌పేట గ్రామ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటోను డ్రైవర్ తుప్రాన్‌పేట గ్రామ సమీపంలోని ఆద్యా హోటల్ వద్ద రోడ్డు పక్కన నిలిపాడు. అదే దారిలో అతివేగంగా కారు వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

సాగర్ నుంచి రెండు గేట్ల ద్వారా నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరద పెరగడంతో మంగళవారం డ్యాం రెండు క్రస్ట్ గేట్లను 10అడుగుల మేర ఎత్తి 30,026 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయంలోకి 67,744 క్యూసెక్కుల నీరు వస్తోంది. సాగర్ జలాశయం నీటిమట్టం గరిష్ట స్థాయిలో 590 అడుగులుగా ఉంది. దీంతో ఎగువ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పాదన ద్వారా 29,151 క్యూసెక్కులతో కలిపి మొత్తం 59,177 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ కాల్వల ద్వారా 17,440 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 4800, వరదకాల్వకు 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.